సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 24 । మే । 2024



అన్నమాచార్యుల శోభాయాత్ర

విశాఖ: అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకుని బీచ్ రోడ్డులో గురువారం నిర్వహించిన శోభాయాత్ర ఘనంగా జరిగింది.



ఫ్లైఓవర్‌పై లారీ బోల్తా 8లో

విశాఖ ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై పేపర్ బండిల్స్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది.

గరిష్టం/కనిష్టం
37.3/26.0

వాతావరణం

తేలికపాటి వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి బుధవారం చెప్పారు.

న్యూస్‌రీల్

పన్ను మోసాలపై విజి'లెన్స్'

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, విశాఖపట్నం : నకిలీ ఇన్‌వాయిస్‌ల పేరుతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సొమ్ము దోచుకుంటున్న కంపెనీలపై కేంద్ర, రాష్ట్ర పన్నుల శాఖల పరిధిలోని విజిలెన్స్ అధికారులు దృష్టిసారించారు. 'పన్నుమోసం.. చెరో సగం' శీర్షికన 'సాక్షి'లో గురువారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. గత ఏడాదిన్నర కాలంలో వచ్చిన ఇన్‌వాయిస్‌ల డేటా సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అదేవిధంగా వరుసగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందుతున్న సంస్థల వివరాలు పరిశీలిస్తున్నారు. ఏయే సంస్థలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సొంతం చేసుకున్నాయి.. ఆ సంస్థల అడ్రస్‌లు ఏంటి.. ఏయే ఇన్‌వాయిస్‌లను సబ్మిట్ చేసి.. క్రెడిట్స్ పొందాయి.. ఇలా విభిన్న కోణాల్లో విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ): ఈస్ట్‌కోస్ట్ రైల్వే నౌపడ, పర్లాకిమిడి యార్డ్, పూండి–నౌపడ స్టేషన్‌ల పరిధిలో జరుగుతున్న వంతెన పునర్నిర్మాణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు, మరికొన్నింటిని రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖపట్నం–గుణుపూర్– విశాఖపట్నం(08522/08521) పాసింజర్ స్పెషల్స్ ఈ నెల 24, 27వ తేదీల్లోను, పలాస–విశాఖపట్నం–విశాఖపట్నం(07471/07470) పాసింజర్ స్పెషల్స్ ఈ నెల 27వ తేదీన రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

- ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం –బ్రహ్మపూర్ (18526) ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 27వ తేదీన ఉదయం 4.30 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్ –షాలిమర్ (07225) సమ్మర్ స్పెషల్ గంట ఆలస్యంగా 5.30 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 26వ తేదీన రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్ –సంత్రగచ్చి (07234) సమ్మర్ స్పెషల్ సుమారు 3 గంటలు ఆలస్యంగా 27వ తేదీ తెల్లవారు 2.4గంటలకు బయల్దేరుతుంది.

గురుకులాల్లో అడ్మిషన్లకు కౌన్సెలింగ్ వాయిదా

కంచరపాలెం (విశాఖ): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో 2024 – 25 విద్యా సంవత్సరానికి విశాఖ జిల్లా, అనకాపల్లి జిల్లా పరిధిలోని ఆరు గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగుల సీట్ల భర్తీ కోసం ఈ నెల 24న నిర్వహించనున్న కౌన్సెలింగ్ వాయిదా వేసినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయ అధికారి ఎస్.రూపవతి ఒక ప్రకటనలో తెలిపారు. 24న శుక్రవారం మేఘాద్రిగెడ్డ గురుకుల పాఠశాలలో జరగాల్సిన స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ సాంకేతిక కారణాల దృష్ట్యా వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు. మరింత సమాచారం కోసం 7658945570, 8790356309లో సంప్రదించాలని ఆమె కోరారు.

బాణసంచా స్వాధీనం

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): గాజువాక హైస్కూల్ రోడ్డులోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన బాణసంచాను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకుని.. యజమానిపై కేసు నమోదు చేశారు. వివరాలివీ.. హైస్కూల్ రోడ్డులో గాంధీ అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా రూ.4 లక్షల విలువగల బాణసంచాను ఇంట్లో నిల్వ ఉంచాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో.. ఇంటిపై దాడి చేసి బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. గాంధీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని హెచ్చరిస్తున్న పోలీసులు



భద్రతాదళాల మాబ్ ఆపరేషన్



భాష్పవాయువు ప్రయోగం

అల్లరి మూకలను అణచివేస్తారిలా..

ప్రజలకు అవగాహన కల్పించేలా పోలీసుల 'మాబ్ ఆపరేషన్'



అదుపు చేయడానికి ఎందాకైనా..

సాక్షి, అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల ఘట్టం తుది దశకు చేరుకుంటోంది. జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కౌంటింగ్‌కు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. జూన్ 1న ఎగ్జిట్ పోల్ సర్వే నివేదికలు వెలువడిన నాటి నుంచి 4న లెక్కింపు జరిగి తుది ఫలితాలు వెలువడేంత వరకు శాంతిభద్రతలను కాపాడేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కేంద్ర బలగాలతో కలిసి పటిష్ట చర్యలు తీసుకుంటోంది. అల్లరి మూకలు అవాంఛనీయ పరిస్థితులు కల్పిస్తే తాము ఎంత కఠినంగా వ్యవహరిస్తామో తెలిపేందుకు గురువారం అనకాపల్లి టౌన్ నాలుగు రోడ్ల జంక్షన్‌లో 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆ సమయంలో పోలీసులు ఏ విధంగా స్పందిస్తారు.. జన సమూహాలను ఎలా చెదరగొడతారు.. లాఠీచార్జ్, టియర్ గ్యాస్, వాటర్ క్యాన్ల ప్రయోగం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికీ అదుపులోకి రాకపోతే కాల్పులు ఎలా జరుపుతారో మాక్ డ్రిల్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. మొదటగా జిల్లా పోలీసులు రెండు భాగాలుగా విడిపోయారు. ఒక భాగం అల్లరి మూకగా.. ఇంకొక భాగం పోలీసులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జూన్ 1 నుంచి ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు గుంపులుగా తిరగకూడదన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు చేపడితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అల్లరి మూకలను అణచివేసేందుకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామన్నారు. అడిషనల్ ఎస్పీ బి.వి జయభాస్కర్, ఫైర్ సర్వీస్ అధికారి నర్సింగరావు, డీఎస్పీలు పి.నాగేశ్వరరావు, ఎస్.అప్పలరాజు, కె.వి.సత్యనారాయణ, జి.ఆర్.ఆర్. మోహన్, అప్పారావు, ఎం.ఉపేంద్రబాబు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇన్‌స్పెక్టర్లు మన్మథరావు, సతీష్, శంకర్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎస్పీ మురళీకృష్ణ తదితర పోలీసు అధికారులు

పారదర్శకంగా కౌంటింగ్ ఏర్పాట్లు

- అభ్యర్థులు, ఏజెంట్లు పరిశీలించుకోవచ్చు
- ఆర్వోలు, డీఆర్వో ఆధ్వర్యంలో పాస్‌ల మంజూరు
- లెక్కింపు కేంద్రంలో సెల్‌ఫోన్లకు అనుమతి లేదు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: వచ్చే నెల 4వ తేదీన పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంటు, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతోపాటు పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఎస్పీ కార్యాలయం సమీపంలోని ఫ్యూచర్ వరల్డ్ స్కూల్లో జరుగుతుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో భాగమైన పెందుర్తి నియోజకవర్గం ఓట్ల లెక్కింపును విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహిస్తారన్నారు. కౌంటింగ్ హాల్లోకి ప్రవేశం, అసెంబ్లీ, పార్లమెంట్ టేబుళ్ల అమరిక వంటి అంశాలను అభ్యర్థులు, ఏజెంట్లు ముందుగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. నిర్ణీత సమయాల్లో వారు వచ్చి ఏర్పాట్లు, రాకపోకల గురించి తెలుసుకోవచ్చని చెప్పారు. కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్లు తప్పనిసరిగా పాస్‌లు తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధిత ఆర్వోలు, ఎంపీ నియోజకవర్గానికి డీఆర్వో పాస్‌లు మంజూరు చేస్తారని చెప్పారు.

లెక్కింపు ప్రశాంతంగా ముగియాలి: ఎస్పీ మురళీకృష్ణ

పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, కౌంటింగ్ ప్రక్రియ కూడా అదే విధంగా సాగాలని, ఇందుకు అన్ని పార్టీల వారు సహకరించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి సుహృద్భావ వాతావరణంలో ఎటువంటి ఘర్షణలకు, హింసకు తావివ్వకుండా, ఇతరుల భావోద్వేగాలను ప్రేరేపించకుండా ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా ముగిద్దామన్నారు. ఒకటో తేదీ నుంచి టీవీలలో ఎగ్జిట్ పోల్స్ ప్రసారమవుతాయని, ఆ రోజు నుంచి శాంతిభద్రతల పర్యవేక్షణకు ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద త్రీటైర్ భద్రత ఉంటుందని చెప్పారు. పికెట్లు, చెక్ పోస్టులు మరింత కట్టుదిట్టం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్వో బి.దయానిధి, ఆర్డీవోలు ఎ.చిన్నికృష్ణ, హెచ్.వి.జయరామ్, ఆర్వోలు మనోరమ, గీతాంజలి, సత్యవాణి పాల్గొన్నారు.

నిబద్ధతతో నిర్భయంగా ఓట్ల లెక్కింపు

ఓట్ల లెక్కింపును నిబద్ధతతో, నిర్భయంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో మాస్టర్ ట్రైనీలకు ఈవీఎంలు, పోస్టల్ బ్యాలట్ లెక్కింపుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాన్యువల్‌లో సూచించిన ప్రకారం ఓటు చెల్లుబాటును గుర్తించవలసి ఉంటుందన్నారు. ముందుగా ఈవీఎంను పరిశీలించి పోలైన ఓట్లను సరిచూడాలన్నారు. తరువాత సాంకేతికపరమైన అంశాలను సరిచూసి ఆపై లెక్కింపునకు వెళ్లాలన్నారు. పోస్టల్ బ్యాలట్ లెక్కింపు, ఈవీఎంల లెక్కింపుపైన కూడా అందరికీ పూర్తి శిక్షణ ఇవ్వాలన్నారు. నియమ నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకోవాలని, చిన్న పొరపాటుకు కూడా అవకాశమివ్వరాదన్నారు.

జూన్ 6 వరకు మందుగుండు సామగ్రిపై నిషేధం

అదనపు ఎస్పీ విజయభాస్కర్, డీఆర్వో దయానిధి



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, డీఆర్వో దయానిధి

తుమ్మపాల: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కోడ్ అమల్లో భాగంగా శుక్రవారం నుంచి జూన్ 6 వరకు జిల్లాలో పేలుడు సామగ్రి తయారీ, విక్రయాలపై నిషేధం అమల్లో ఉంటుందని అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని పేలుడు పదార్థాల తయారీదారులు, విక్రేతలు, పెట్రోల్ పంప్‌ల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేలుడు పదార్థాలను ఎవరు ఉపయోగించినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పండగలు, ఉత్సవాలు జరిగినా బాణసంచా కాల్చేందుకు వీల్లేదన్నారు. పెట్రోల్‌ను బాటిళ్లు, క్యాన్లలో అమ్మకాలపై కూడా నిషేధం ఉందన్నారు. మైన్స్ బ్లాస్టింగ్ జిలెటిన్ స్టిక్స్‌ను ఇతరులు వాడరాదని, మైన్స్ యాజమాన్యం నుంచి డిక్లరేషన్ తప్పనిసరన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు ఊరేగింపులు, సంబరాలకు అనుమతులు లేవన్నారు. అగ్నిమాపక, మైన్స్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు ఎక్కువగా చేయాలని సూచించారు. పేలుడు పదార్థాలు అడిగేవారి వివరాలను సమీపంలోని పోలీసులకు తెలపాలని తయారీ, అమ్మకందార్లను కోరారు. సమావేశంలో నర్సీపట్నం డీఆర్ ఆర్.మోహన్, జిల్లా అగ్నిమాపకాధికారి ఆర్‌వీ రమణ, జిల్లాలోని పెట్రోల్ కంపెనీల సేల్స్ మేనేజర్లు, పేలుడు పదార్థాల తయారీదార్లు, విక్రేతలు పాల్గొన్నారు.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు





రమా సహిత సత్యనారాయణ స్వామి, సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు

డాబాగార్డెన్స్ (విశాఖ): నగరంలోని ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. బుద్ధ, వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువజాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. సాయంత్రం వరకు భక్తుల తాకిడి కనిపించింది.

భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వేసవి తీవ్రత దృష్ట్యా పెండాల్స్ ఏర్పాటు చేశారు.

ఉద్యోగ విజయోత్సవం



ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న ఆకాశవాణి డైరెక్టర్ రత్నప్రసాద్ తదితరులు

నర్సీపట్నం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 2023–24 వార్షిక సంవత్సరంలో ప్రముఖ కంపెనీలు అమర్ రాజా బ్యాటరీస్, డెక్కన్, రిలేబుల్ టెక్నో సిస్టమ్స్, వీల్స్ ఇండియా, స్ట్రక్చరల్ సొల్యూషన్, ఎప్టానిక్, మీడియా సర్వో తదితర కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 56 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగ విజయోత్సవం నిర్వహించి వారికి ప్రముఖుల చేతుల మీదగా నియామక పత్రాలు అందజేశారు. ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ ఎం.వి.రత్నప్రసాద్, వాటర్ రిసోర్స్ డిపార్టుమెంట్ డీఈఈ ఎం.రాజేంద్రప్రసాద్, మైన్స్ మేనేజర్ ఎం.రామస్వామి పాల్గొన్నారు. పాలిటెక్నిక్ విద్యకు ఎంతో ప్రాధాన్యం ఉందని వక్తలు పేర్కొన్నారు. చదువుతుండగానే ఉద్యోగాలు సాధించిన మీరంతా ఎంతో అదృష్టవంతులన్నారు. ప్రయోజకులై మీ కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచారని కొనియాడారు. ముఖ్య అతిథులను కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.రామచంద్రరావు, అధ్యాపకులు సన్మానించారు.

అప్పన్నకు రెండో విడత చందనం సమర్పణ

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం రెండో విడత చందన సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారు జాము రెండు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం మూడు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించారు. అనంతరం ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషంగా పంచకలశ స్నపనం నిర్వహించారు.

విద్యార్థులకు మరో చాన్స్

- నేటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- పరీక్షలకు సర్వం సిద్ధం చేసిన అధికారులు

అనకాపల్లి, విశాఖ విద్య: పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఒకేసారి టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతుండటంతో అనకాపల్లి జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ప్రతీ రోజూ ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పరీక్షలు జరగనున్నాయి. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటి సదుపాయంతోపాటు ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలతో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

20 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లాలో మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 9,326 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రతీ రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.గంటల వరకు పరీక్ష జరగనుంది. అదే విధంగా సెకండియర్ జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 5,481 మంది విద్యార్థులు రాయనున్నారు. వీరికి ప్రతీ రోజూ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరగనుంది. మొత్తం 14,807 మంది పరీక్షలు రాస్తున్నారు. జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

టెన్త్ పరీక్షలకు 4,930 మంది విద్యార్థులు

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 4,930 మంది విద్యార్థులు హాజరుకానుండగా 20 కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి జూన్ 3 వరకు ప్రతీ రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఇదిలా ఉండగా సార్వత్రిక విద్యా విధానంలో(ఓపెన్ స్కూల్) టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు జూన్ 1 నుంచి 8 వరకు ప్రతీ రోజూ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా జిల్లా అధికారులు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. మాస్ కాపీయింగ్‌కు అడ్డుకట్ట వేసేలా పరీక్షలు జరిగే అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చారు. పరీక్ష రాసే గదిలో ఏం జరుగుతుందనేది నేరుగా పరిశీలన చేసేలా లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేశారు. ఇంటర్ పరీక్షలను ఆర్ఐవో పి.మురళీధర్ నేతృత్వంలోని జిల్లా స్థాయి అధికారుల బృందం (డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ) పర్యవేక్షణ చేయనుంది. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.



ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్

ఏర్పాట్లు పూర్తి చేశాం



పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎటువంటి ఇబ్బంది ఎదురైనా సకాలంలో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చేలా కేంద్రాల సూపరింటెండెంట్‌లకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఇంటర్మీడియట్ బోర్డు అధికారుల ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్, జేసీ సూచనలతో వార్షిక పరీక్షల మాదిరే, సప్లిమెంటరీ పరీక్షలను కూడా జిల్లాలో విజయవంతం చేసేలా అంతా సమన్వయంతో పనిచేస్తున్నాం.

–పి.మురళీధర్, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

కేజీహెచ్‌కు 5 బ్యాటరీ వాహనాలు

రూ.40లక్షలతో కొనుగోలు చేసిన స్టీల్‌ప్లాంట్



బ్యాటరీ కార్లను ప్రారంభిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున, స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చి



బ్యాటరీ కారులో ప్రయాణిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చి

మహారాణిపేట (విశాఖ): రోగుల రవాణా కోసం 24/7 పనిచేసే ఐదు బ్యాటరీ కార్లను కేజీహెచ్‌కు విశాఖ స్టీల్‌ప్లాంట్ అందజేసింది. కేజీహెచ్ ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(ప్రాజెక్ట్) ఎ.కె.బాగ్చి వీటిని ప్రారంభించారు. సీఈఆర్(కార్పొరేట్ ఎన్విరాన్‌మెంటల్ రెస్పాన్సిబిలిటీ)లో భాగంగా స్టీల్‌ప్లాంట్ రూ.40 లక్షలు వెచ్చించి ఐదు బ్యాటరీతో నడిచే వాహనాలను కొనుగోలు చేసి కేజీహెచ్‌కు అందించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగుల రవాణాకు ఉపయోగపడేలా బ్యాటరీ వాహనాలు అందించిన స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ప్లాంట్ డైరెక్టర్ బాగ్చి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో ఏళ్లుగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నామని, రోగుల కోసం ఈ వాహనాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ ఉక్కు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలుపుతూ డైరెక్టర్‌కు జ్ఞాపిక అందజేశారు. అనంతరం కలెక్టర్, స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బ్యాటరీ కార్లను నడిపారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం(సర్వీసెస్) ప్రవీణ్‌కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఉక్కు కర్మాగారం ఫారెస్ట్ అండ్ క్లైమేట్ కమిటీ సభ్యుడు డాక్టర్ ఈవీఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని అహింసా మార్గం అనుసరణీయం


బుద్ధుడి చిత్రపటం వద్ద నివాళులర్పించి, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఎంపీ సత్యవతి

అనకాపల్లి: భగవాన్ బుద్ధుడు ప్రపంచానికి అహింస..శాంతి..ధర్మ మార్గాలను ప్రభోదించిన గొప్ప మహనీయుడని ఎంపీ బీవీ.సత్యవతి అన్నారు. తమ కార్యాలయంలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2568వ జయంతి (బుద్ధ పూర్ణిమ)ని పురస్కరించుకుని బుద్ధుని చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా బుద్ధ పూర్ణిమ పర్వదినంగా ఆరాధించి పూజలు చేసుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. మండలంలో శంకరం పంచాయతీ పరిధిలో బొజ్జన్నకొండ అంతర్జాతీయ బౌద్ధ పర్యాటకులుగా విరాజిల్లుతుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి బొజ్జన్నకొండకు వచ్చే పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రతి వ్యక్తి బుద్ధుని అహింసా మార్గంలో నడుచుకోవాలని ఆమె కోరారు. అంతకుముందు అసోసియేషన్ ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ 'బొజ్జన్న కొండ చరిత్ర..విశిష్టత అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచనపై గెలుపొందిన 16 విద్యార్థినీ విద్యార్థులను సర్టిఫికెట్లతో అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, సభ్యులు వినోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, కొత్తూర్తి రామారావు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో విజయ్ దేవరకొండ సందడి



తిమ్మాపురంలో సందడి చేసిన హీరో విజయ్ దేవరకొండ

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలో ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ సందడి చేశారు. ఆయన నటిస్తున్న ఓ చిత్రానికి సంబంధించిన షూటింగ్ కోసం ఈ నెల 5న నగరానికి చేరుకున్నారు. అప్పటి నుంచి ఆర్‌కే బీచ్, యారాడ బీచ్ వద్ద ఏర్పాటు చేసిన సెట్ల వద్ద సినిమా చిత్రీకరణలో పాల్గొన్నారు. బుధవారం తిమ్మాపురంలో ఓ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫొటో షూట్ కోసం ఇక్కడకు వచ్చారు. అభిమానులతో ఫొటోలు తీసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ అంటే తనకు ప్రత్యేకమైన ఇష్టమని, ఇక్కడి ప్రకృతి అందాలు, బీచ్ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. వచ్చేనెల 3 వరకు నగరంలో ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కొనసాగుతుందని చిత్ర యూనిట్ తెలిపింది.

కపిలేశ్వరస్వామి పుష్పయాగానికి విశాఖ పూలు

ఎంవీపీ కాలనీ (విశాఖ): తిరుపతిలోని కపిలేశ్వర స్వామి పుష్పయాగానికి విశాఖ నుంచి వివిధ రకాల పూలు తరలివెళ్లాయి. విశాఖ సాగరతీర కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వద్ద బుధవారం రాత్రి ఈ పూలకు సంకల్పం నిర్వహించి అనంతరం రైలులో తిరుపతి తరలించారు. గురువారం ఈ పూలతో స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. కలువలు, తామరలు, తులసి, మల్లి తదితర రకాలు 10 వేల పూలను పంపించినట్టు కమిటీ ప్రతినిధి హిమాన్షు ప్రసాద్ తెలిపారు.

ఆవకాయకు ధరల ఘాటు

- దిగుబడి తగ్గిన మామిడికాయలు
- పెరిగిన దినుసుల ధరలు


తయారు చేసిన ఆవకాయ


ఆవకాయలో ఉపయోగించే మామిడి కాయలు

నక్కపల్లి: ఆవకాయ పెట్టాలంటే అంత ఆషామాషీగా అనిపించడం లేదు. తగ్గిన మామిడి దిగుబడి, పెరిగిన దినుసులు ధరలతో ఆవకాయ వాసనలు అక్కడక్కడ మాత్రమే కనిపిస్తున్నాయి. ఆవకాయ పచ్చడితో ఆంధ్రులకు మంచి అనుబంధం ఉంది. ముద్ద పప్పు, ఆవకాయతో ఒక్కసారైనా భోజనం చేయాల్సిందే. వేసవి కాలంలో ఆవకాయ తయారు చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఆవకాయ పచ్చడి తయారు చేస్తారు. సరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో ఈ ఏడాది ఆవకాయ తయారు చేయడం అంత సులభంగా కన్పించడం లేదు.

ఘాటెక్కిన ధరలు

ఏడాది పాటు ఆవకాయ నిల్వ ఉండేందుకు నంబర్ వన్ రకం సరుకులు వాడాల్సిందే. అయితే గత ఏడాదితో పోలిస్తే మామిడి కాయలు, వేరుశనగ నూనె, వెల్లుల్లి, ఆవాలు, మిరపకాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 50 మామిడి కాయలను ఉపయోగించి ఆవకాయ పెట్టాలంటే సుమారు రూ.1200 వరకు ఖర్చవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ మిరపకాయల ధర రూ.180 నుంచి రూ.200 వరకు ఉంది. నంబర్ వన్ రకం వేరుశనగ నూనె రూ.190 నుంచి రూ.230 వరకు ఉంది. ఆవాలు రూ.80 నుంచి రూ.100, వెల్లుల్లి కిలో రూ.200 వరకు ఉన్నాయి. ఆవకాయకు ఉపయోగించే మామిడి కాయలయితే వందకాయలు రూ.500 వరకు చెల్లించాల్సి వస్తోంది.

నాణ్యమైన రకాలేవీ...!

వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి బాగా తగ్గిపోయింది. దీనికితోడు తెగుళ్లు కూడా బాగా సోకడంతో నాణ్యమైన మామిడి కాయలు దిగుబడి తగ్గింది. ఆవకాయ కోసం ఎక్కువగా కోలంగోవా, కొత్తపల్లి కొబ్బరి, సువర్ణరేఖ, కలెక్టర్ తదితర రకాల మామిడి కాయలను వినియోగిస్తుంటారు. ఈ ఏడాది కలెక్టర్ మినహా మిగతా రకాల మామిడి కాయల దిగుబడి తగ్గిపోయింది.

ఎన్నో వ్యయ ప్రయాసలు

ఏడాది పాటు నిల్వ ఉండే ఆవకాయ కోసం తయారీదారులు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. సరైన సమయంలో లేతపరువుతో ఉన్న కాయలనే ఆవకాయ కోసం వినియోగిస్తుంటారు. టెంక కట్టకపోయినా, మచ్చ ఉన్నా, మెత్తగా ఉన్నా వందలాది రూపాయలు వెచ్చించి తయారు చేసిన ఆవకాయ పాడయ్యే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని చాలామంది సొంతంగా ఆవకాయ పెట్టుకునే బదులు సీజనల్ వ్యాపారుల వద్ద సూపర్ మార్కెట్లో లభించే ఆవకాయ డబ్బాలను కొనుగోలు చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. పట్టణంలో తోపుడు బళ్లమీద, గ్రామాల్లో అయితే సైకిళ్లు, ఆటోల్లోను తెచ్చి పచ్చళ్లు విక్రయిస్తున్నారు.

తయారీ తగ్గించేశాం

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల కారణంగా పచ్చళ్ల వ్యాపారం పెద్దగా రాణించడం లేదు. గతంలో తక్కువ ఖర్చులతో నిల్వ ఉండే ఊరగాయలు పెట్టేవాళ్లం. చుట్టుపక్కల వాళ్లు కొనుగోలు చేసేవారు, ఇప్పుడు పెరిగిన దినుసుల ధరల కారణంగా ఊరగాయల ధరలు పెంచాల్సి వస్తోంది. దీంతో కొనుగోళ్లు తగ్గిపోతున్నాయి. దీంతో మేము కూడా ఊరగాయల తయారీ తగ్గించేశాం.

–సుబ్బలక్ష్మి, పచ్చళ్ల వ్యాపారి, పాయకరావుపేట

సొంతంగా తయారు చేస్తేనే రుచి

నిల్వ ఉన్న ఊరగాయలు సొంతంగా పెట్టుకుంటే బాగానే ఉంటుంది, పాడవకుండా ఉంటాయి. కానీ 50 మామిడి కాయలతో ఊరగాయ పెట్టాలంటే వెయ్యి రూపాయలు ఖర్చవుతోంది. తప్పని పరిస్థితుల్లో ఖర్చయినా ఇళ్లల్లో వాడకం కోసం పెట్టక తప్పడం లేదు.

–విశాలాక్షి, గృహిణి

సంకీర్తనా సార్వభౌముడు అన్నమయ్య


బహుమతులు అందుకున్న విజేతలతో సీతారామాచార్యులు, జి.ఎస్.ఎన్.రాజు తదితరులు

సీతంపేట: అన్నమాచార్య జయంతి సందర్భంగా శృతిలయ సంస్థ అధ్యక్షుడు వి.ప్రభాకర్ సారథ్యంలో ఇటీవల నిర్వహించిన సంకీర్తనల పోటీల విజేతలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం బహుమతుల ప్రదానం జరిగింది. సింహాచలం దేవస్థానం పురోహితుడు సీతారామాచార్యులు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశాఖ పౌర్ణమి రోజున విశాఖ నక్షత్రంలో అన్నమయ్య జన్మించారని తెలిపారు. పద కవితా పితామహుడిగా అన్నమయ్య పేరు గాంచి సరళమైన తెలుగు భాషలో వెంకటేశ్వరస్వామిని కీర్తిస్తూ 32 వేల సంకీర్తనలు రచించి, సంకీర్తనా సార్వభౌముడిగా ఖ్యాతి పొందారన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ శృతిలయ సంస్థ ద్వారా చేపడుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీనివాస కల్యాణ ఉత్సవాల గురించి ప్రశంసించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వంకాయల సన్యాసిరాజు, కొణతాల రాజు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, పి.రంగనాథ ఆచార్యులు, సంస్థ కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, ప్రోగ్రాం కన్వీనర్ సిహెచ్.వి.సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై లారీ బోల్తా

- తప్పిన పెను ప్రమాదం
- పేపర్ బండిల్స్‌ను మరో లారీలో తరలించిన ట్రాఫిక్ పోలీసులు


పేపర్ బండిల్స్‌ను మరో లారీలోకి లోడింగ్ చేస్తున్న కూలీలు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై పేపర్ బండిల్స్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటు చేసుకోవడం, బ్రిడ్జిపైనే లారీ బోల్తా పడటంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ఘటన జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఎయిర్ పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. కోల్‌కతా నుంచి షీలానగర్‌కు పేపర్ బండిల్స్ లోడుతో వెళ్తున్న లారీ.. ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పైకి రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. లారీలో ఉన్న పేపర్ బండిల్స్ రోడ్డుపై పడిపోయాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల నుంచి 3 గంటల మధ్య ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో ఇతర వాహనాల రాకపోకలు లేకపోవడం, లారీ కూడా బ్రిడ్జిపైనే బోల్తా పడటంతో ప్రమాద తీవ్రత తగ్గింది. ఈ ప్రమాదంలో క్లీనర్ ఆలీకి స్వల్ప గాయాలయ్యాయి. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ బాలరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బోల్తా పడిన లారీలో ఉన్న 60 బండిల్స్‌ను మరో లారీలోకి క్రేన్ సాయంతో లోడింగ్ చేసి షీలానగర్ తరలించారు. లారీని బ్రిడ్జి పై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. బ్రిడ్జిపైకి ఎక్కి రోటరీలో వెళ్లే సమయంలో డ్రైవర్ నిద్రమత్తు వల్ల లారీని అదుపు చేయలేక బోల్తా పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఎయిర్ పోర్టు పోలీసులు ప్రమాద వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


మృతురాలు చినతల్లి (ఫైల్)


మృతదేహం వద్ద స్థానికులను విచారిస్తున్న ఎస్‌ఐ సురేష్

రోలుగుంట: మండలంలో అడ్డసరం పంచాయతీ శివారు నందిపురం గ్రామానికి చెందిన పాము చినతల్లి (65) గురువారం వేకువజామున విద్యుదాఘాతం ప్రమాదంలో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. భోగాపురం-కొంతలం మార్గంలో విద్యుత్ సరఫరా జరిగే మెయిన్ లైనులో నందిపురం గ్రామం మలుపులో గురువారం వేకువజామున మూడు గంటల సమయంలో చెట్టుకు విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ అయ్యి మంటలు రేగాయి. స్తంభం నుంచి వైర్లు తెగి కిందకు పడ్డాయి. ఆ సమయంలో గ్రామానికి చెందిన పాము చినతల్లి ఇంట్లో నుంచి బయటకు వచ్చి ఈ మంటలు చూసి పరుగెత్తడంతో వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై మృతురాలి కుమారుడు దేముడు రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ ఎల్.సురేష్ కేసు నమోదు చేసి గురువారం సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేశారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ పద్మనాభం వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. రాత్రి వీచిన గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయని, దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేసినట్టు విలేకరులకు తెలిపారు.

కిక్కిరిసిన వరాహ పుష్కరిణి

- వైశాఖ పౌర్ణమికి పోటెత్తిన భక్తులు
- తరలివచ్చిన గరిడి బృందాలు


గరిడి బృందాలతో తరలివచ్చి కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు


భక్తులతో కిక్కిరిసిన వరాహ పుష్కరిణి ప్రాంగణం

సింహాచలం : వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా కొలిచే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మత్స్యకారులు, గ్రామీణ ప్రాంతాల భక్తులు, ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము ఒంటి గంట నుంచే కొండదిగువ వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. స్వామివారి ప్రతిరూపాలుగా వెంట తీసుకొచ్చిన కోలలకు పూజలు నిర్వహించారు. వంటలు వండుకుని సహపంక్తి భోజనాలు చేశారు. మెట్లమార్గం ద్వారా సింహగిరికి నడిచి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. గరిడి వాయిద్యాలతో స్వామిని కీర్తించారు. స్నానమాచరించేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి కిక్కిరిసింది. వంటలు వండుకుని, సహపంక్తి భోజనాలు చేసే భక్తులతో అడవివరం ప్రాంతంలోని సంత ప్రాంగణం, ప్రియాగార్డెన్స్, హవేళి ప్రాంగణం, పాత అడవివరంలోని మామిడి తోటలు నిండుకున్నాయి. మార్కెట్ కూడలి నుంచి వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గం తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిక్కిరిసింది. పుష్కరిణి వద్ద దేవస్థానం గార్డులు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన భక్తులతో సింహగిరి మెట్లమార్గం, సింహగిరిపై ఉన్న క్యూలు కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల రద్దీగా మారింది. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సాగర సంరక్షణ సమష్టి బాధ్యత


మాట్లాడుతున్న ప్రసాదరావు

బీచ్‌రోడ్డు: సుందరమైన విశాఖ తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకుని.. పరిరక్షించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య సహాయ అధికారి బి.ప్రసాదరావు పిలుపునిచ్చారు. బీచ్ వీధి వర్తకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మేము సైతం అనే కార్యక్రమాన్ని గురువారం బీచ్‌రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ సముద్ర తీర ప్రాంతం ఎంతో సుందరమైందని, ఇది మనకి ప్రకృతి ఇచ్చిన వరం అన్నారు. తీరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సందర్శకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్యాపారస్తులు దుకాణాలు వద్ద చెత్త సేకరణ బకెట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ స్పూన్లు వినియోగించకూడదన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ సారి విశాఖ మరింత మెరుగైన ర్యాంక్ సాధించేందుకు ప్రజలంతా భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బి.సత్యనారాయణ, గోవింద్, సంక్షేమ సంఘం సభ్యులు సిహెచ్ రమణ, గిదితురు శ్రీను, తెడ్డు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి


ఎండ నుంచి చీర కొంగే రక్షణ

సాక్షి, విశాఖపట్నం : ఉక్కపోత జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఒకపక్క ఉష్ణతాపం ఇబ్బంది పెడుతుంటే.. అది చాలదన్నట్టు ఉక్కపోత దానికి తోడైంది. ఫలితంగా ఈ రెండూ జత కలిసి ముచ్చెమటలు పోయిస్తున్నాయి. ఉదయం పొద్దెక్కగానే అసౌకర్య వాతావరణం మొదలవుతోంది. ఎండ ముదిరే కొద్దీ ఉక్కపోత కూడా అధికమవుతోంది. సాయంత్రం సూర్యాస్తమయం అయినా వేడి తగ్గినా ఉపశమనం కలగడం లేదు. పలువురు తమ ఇళ్లలో ఏసీలు, ఫ్యాన్లు రేయింబవళ్లు ఆపడం లేదు. ఇళ్లు, కార్యాలయాల్లో ఫ్యాన్లు గిరాగిరా తిరుగుతున్నా ఏమంత ఫలితం ఉండడం లేదు. వీటి నుంచి బయటకు రాగానే చెమటతో తడిసి ముద్దవుతున్నారు. సాధారణంగా గాలిలో తేమ 50 శాతానికి లోపు ఉంటే ఉక్కపోత ప్రభావం కనిపించదు. కానీ అంతకు పైగా నమోదైతే మాత్రం ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో గాలిలో తేమ 60–70 శాతం వరకు ఉంటోంది. గురువారం విశాఖలో గాలిలో తేమ 68 శాతం ఉంది. మరో మూడు, నాలుగు రోజులు ఈ తేమ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో ఉక్కపోత మరింత తీవ్రం కానుంది. అప్పటి వరకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించే అవకాశం లేదు.

ఏటీఎం కేంద్రం వద్ద ఉక్కు ఉద్యోగికి టోకరా


ఏటీఎం కేంద్రం వద్ద బాధితుడు నాయక్

అగనంపూడి : ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్న క్రమంలో ఏటీఎం కేంద్రాల వద్ద కూడా మోసగాళ్లు చేతి వాటం చూపించి టోకరా వేస్తున్నారు. అగనంపూడిలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం కేంద్రం వద్ద ఉక్కు ఉద్యోగికి టోకరా వేసిన సంఘటనపై దువ్వాడ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. అగనంపూడి పెదమడక నిర్వాసితకాలనీలో నివసిస్తున్న ఉక్కు ఉద్యోగి ఎన్.బి.నాయక్ బుధవారం రాత్రి 8 గంటలకు యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం కేంద్రంలో రూ.5 వేలు డ్రా చేశారు. తర్వాత మరో రూ.3 వేలు తీసేందుకు ప్రయత్నించగా డబ్బులు రాలేదు. యాక్సిస్ బ్యాంక్ కార్డుతో డబ్బులు రాకపోవడంతో వెనుకనున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తికి కెనరా బ్యాంక్ కార్డు ఇవ్వడంతో ఆయన కూడా ప్రయత్నించాడు. అయినప్పటికీ డబ్బులు రాకపోవడంతో నాయక్ ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం ఏ షిఫ్ట్ విధులకు వెళ్లి ఫోన్లో మెసేజ్‌లు చూడగా బుధవారం రాత్రి రూ.25వేలు, గురువారం ఉదయం రూ.50వేలు నగదు డ్రా చేసినట్టు మెసేజ్‌లు చూసి అవాక్కయ్యారు. సహచర ఉద్యోగి సహకారంతో ఏటీఎం కార్డును బ్లాక్ చేసి తర్వాత దువ్వాడ సీఐ ఎర్రంనాయుడుకి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఏటీఎం కేంద్రానికి చేరుకొని ఆరా తీశారు. అయితే ఏటీఎం కేంద్రంలోని భద్రతా సిబ్బందిని ఇటీవలే తొలగించారని, అలాగే సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదని తెలిసింది. ఏటీఎం కేంద్రాల వద్ద భద్రత డొల్లగా ఉండడం వల్ల ఇటువంటి మోసాలు తరచూ జరుగుతున్నాయని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎర్రంనాయుడు కోరారు.

సార్వాకు సన్నద్ధం

తొలకరితో పుడమి పులకరిస్తోంది. సార్వా(ఖరీఫ్) సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పొలాలను లోతుగా దుక్కి చేసి, విత్తుకు సిద్ధం చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల పుణ్యమా అని రైతుకు అవసరమైన సేవలు, ఎరువులు, విత్తనాలు.. అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వరి విత్తనాలు, ఎరువులకు అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. దీంతో ఈ ఖరీఫ్ సీజన్ రైతులకు అన్ని విధాలా అనుకూలంగా ఉంది.


వర్షాలు పడటంతో ట్రాక్టర్‌తో దున్ని పొలాన్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతులు

- ఖరీఫ్‌కు అనుకూలిస్తున్న వర్షాలు
- దుక్కులకు సిద్ధమవుతున్న రైతులు
- రైతు భరోసా కేంద్రాలకు చేరుతున్న విత్తనాలు
- ఎరువులు, విత్తనాల సరఫరాపై అధికారుల దృష్టి
- మండలంలో 2,500 హెక్టార్లలో వరి సాగు అంచనా

తుమ్మపాల: ఖరీఫ్‌కు రైతులు కోటి ఆశలతో సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో అదనుకు తగ్గట్టు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు దుక్కులు చేస్తున్నారు. ప్రభుత్వం సైతం ముందుగానే విత్తనాలను ఆర్బీకేలకు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఎరువుల సరఫరాపై కూడా అధికారులు దృష్టి పెట్టారు. ఏటా మాదిరే మండలంలో రైతులు ఎక్కువగా వరి సాగుకు సిద్ధమవుతున్నారు.

ప్రణాళికలు సిద్ధం

ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు 2024 ఖరీఫ్ సాగు ప్రణాళికలను ఆర్బీకేల వారీగా సిద్ధం చేశారు. ఈ సీజన్లో వరి అధిక విస్తీర్ణంలో సాగు చేయడం పరిపాటి. 2,150 హెక్టార్ల వరకు వరి పంట సాగు చేస్తున్నారు. నువ్వులు, మినుములు, వేరుశనగ కూడా వేస్తారు. సాధారణ విస్తీర్ణం 2,150 హెక్టార్లు కాగా, వర్షానుకూల పరిస్థితులను బట్టి సాగు విస్తీర్ణం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మండలంలో రెండవ ప్రధాన పంట చెరకు సాగు ఏటా తగ్గుతోంది. ప్రభుత్వ లెక్కల మేరకు 128 హెక్టార్లలో మాత్రమే సాగవుతోంది. 100 హెక్టార్లలో కూరగాయలతో పాటు చిరుధాన్యాలు పండిస్తున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. ఈ ఏడాది మాత్రం సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారుల అంచనా.

ఆర్బీకేలకు చేరిన విత్తనాలు

మండలంలోని అన్ని ఆర్బీకేలకు ఖరీఫ్‌కు అవసరమైన కొన్ని రకాల విత్తనాలు చేరుకున్నాయి. దుక్కుల అనంతరం భూమి సారవంతం చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగు, పిల్లిపెసర సిద్ధంగా ఉన్నాయి. ఆర్బీకేల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని రాయితీపై విత్తనాలు తీసుకెళ్లవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 28 నాటికి వరి విత్తనాలను కూడా ఆర్బీకేలకు చేర్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

తంచనుగా పెట్టుబడి సాయం

పంటల సాగు సమయంలో రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవకుండా ప్రభుత్వం అన్నదాతల ఖాతాల్లో పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులు రూ.5,500 చొప్పున జమ చేస్తోంది. గత ఐదేళ్లుగా ఏటా ప్రభుత్వం తంచనుగా అందిస్తూ వచ్చింది. ఈసారి ఎన్నికల నేపథ్యంలో రైతు భరోసా నిధులు జమ చేస్తారా, లేదా అని రైతులు ఆందోళన చెందారు. బటన్ నొక్కి పథకాల సొమ్ములను జమ కాకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. పోలింగ్ ముగియడంతో ఒక్కో పథకం నిధులు లబ్ధిదారుల ఖాతాలకు జమవుతున్నాయి. రైతు భరోసా నిధులు కూడా ఒకటి రెండు రోజుల్లో జమకానున్నట్లు అధికారులు చెప్పుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ముమ్మరంగా జరుగుతున్న దుక్కులు

త్వరలో వరి విత్తనాలు



ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉంది. వర్షాలు కూడా మొదలయ్యాయి. దీంతో రైతులు ముందుగానే ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు. పంట పొలాల్లో దుక్కులు ముమ్మరంగా చేస్తున్నారు. భూమి సారవంతానికి ఉపయోగపడే పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై అందించేందుకు ఆర్బీకేల్లో సిద్ధంగా ఉన్నాయి. మండలంలో 12 క్వింటాళ్ల పచ్చి జనుము, 5 క్వింటాళ్ల జీలుగు, 4 క్వింటాళ్ల జనుము, 2 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉన్నాయి. రైతుల అవసరం మేరకు వరి విత్తనాలు కూడా త్వరలోనే తీసుకొచ్చి రైతులకు పంపిణీ చేస్తాం

– పీబీ రంగాచారి, వ్యవసాయ విస్తరణ అధికారి, అనకాపల్లి మండలం

బీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


సంఘ వార్షికోత్సవంలో కేక్ కట్ చేస్తున్న బంధం పైడిరాజు

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి విజయ రెసిడెన్సీలో ఏపీ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం 10వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి బంధం పైడిరాజు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో పదేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏటా జిల్లా వ్యాప్తంగా టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బండారు సోమినాయుడు, చింతకాయల కొర్లయ్య, వేగి త్రినాథ్, సీహెచ్ రాజు, కొల్లి నాయుడు, జయ, లక్ష్మి, లీల, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర కాస్త పెరిగింది. గత వారం కిలో రూ.30 ఉండగా, ఈ వారం రూ.10 పెరిగి రూ.40కి చేరింది. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు రూ.30, దొండకాయలు, బెండకాయలు, వంకాయలు రూ.40, బీట్రూట్, క్యారెట్, కాకరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి. పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి కూరగాయలు, మామిడి పండ్లు కొనుగోలు చేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు సెక్షన్ పరిధి 11 కేవీ ఫీడర్ మరమ్మతు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో కొత్తూరు సెక్షన్ పరిధి కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం, మూలపేట, వేటజంగాలపాలెం, సంపతిపురం, వెంకుపాలెం, రొంగలివానిపాలెం, కుంచంగి, కూండ్రం, కశింకోట మండలంలో విసన్నపేట, రామన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

లక్ష్మీనృసింహునికి చందన సమర్పణ


రెండో విడత చందన సమర్పణ తర్వాత లక్ష్మీనృసింహస్వామి

కశింకోట: స్థానికలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని రెండో విడత చందనాన్ని సమర్పించారు. వైశాఖ శుద్ధ తదియ రోజు స్వామి చందనాన్ని తొలగించి, సింహాచలం తరహాలో భక్తులకు నిజరూప దర్శనం కల్పించిన విషయం తెలిసిందే. అదే రోజు శాస్త్రోక్తంగా మళ్లీ చందనాన్ని పూశారు. వైశాఖ పౌర్ణమికి రెండో విడత చందనాన్ని సమర్పించడం సంప్రదాయం. చందన సమర్పణలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఘనంగా వేణుగోపాలస్వామి వసంతోత్సవం

కశింకోట: దేవదాయ శాఖకు చెందిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం నాగవల్లి వసంతోత్సవం, పూర్ణాహుతి నిర్వహించారు. స్వామివార్ల మూల విరాట్‌లతోపాటు ఉత్సవ విగ్రహాలను పూలతో అలంకరించి పూజించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, ప్రధాన అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు, అర్చకుడు రేజేటి మారుతి తదితరులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై, స్వామిని దర్శించుకున్నారు.

అనకాపల్లి సినిమాలు

డర్టీ ఫెలో	: రాజా
ఫ్యూరియోసా	: సత్యనారాయణ స్క్రీన్-1
వ్యాన్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్తిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
సిల్క్ శారీ	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 571 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,260	5,180
మొదటి రకం	4,300	5,990
రెండో రకం	3,800	4,500
మూడోరకం	3,700	4,000

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 81 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-39 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు. లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోండి


కశింకోట మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి


హాజరైన అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు

- మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కలగా లక్ష్మి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన పరిషత్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అవసరమైన మేరకు ట్యాంకర్లను ఏర్పాటు చేయాలన్నారు. చెరకాం సర్పంచ్ వెన్నెల దేముడుబాబు తమ గ్రామంలో మంచినీటి కొరత గురించి సభ దృష్టికి తీసుకు రావడంతో పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పావనిని ఆదేశించారు. పలు గ్రామాల్లో నీటి సమస్య మెరుగుకు బోర్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. సీఐ ఎం.వినోద్‌బాబు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రస్తుతం 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ఆ మేరకు అంతా నడుచుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో శేషుబాబు, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం


శ్రీనివాసుని కల్యాణంలో పాల్గొన్న దంపతులు

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఇంటింట గోవింద కార్యక్రమంలో భాగంగా తిమ్మాపాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో గురువారం శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. 108 ఉభయదాతలు కల్యాణ క్రతువులో పాల్గొన్నారు. దంపతుల సమక్షంలో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ ఏటా స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా త్రిపురాంతకస్వామి కల్యాణోత్సవం


అలంకరణలో సర్వమంగళాంబ


కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

కశింకోట: స్థానిక పురాతన శివాలయంలో వెలసిన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి 108వ కల్యాణోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ముందుగా ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించిన వేదికపై స్వామి, దేవేర్ల ఉత్సవ విగ్రహాలను అధిష్ఠింపజేశారు. విగ్రహాలను పూలమాలలు, నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా 108 మంది ఉభయదాతలతో సామూహిక కల్యాణోత్సవం జరిపించారు. సంప్రదాయం మేరకు గణేష్ పూజ, విష్వక్సేన పూజ, యజ్ఞోపవీత ధారణ, కన్యాదానం, జీలకర్ర బెల్లం పెట్టడం, మాంగల్యధారణ, తలంబ్రాలు, కర్పూర దండల అలంకరణ తదితర ఘట్టాలను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. ముందుగా ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారి మూల విరాట్‌లకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని, అమ్మవారిని దర్శించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ అర్చకులు వి.బాబ్జి, వి.కృష్ణల ఆధ్వర్యంలో శివ సన్నిధి గ్రూప్ సభ్యులు, దాతల సహకారంతో కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.


అన్న సమారాధనలో భక్తులు


కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


దార్లపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : ప్రభుత్వ పాఠశాల ద్వారా నాణ్యమైన, ఒత్తిడి లేని విద్య పిల్లలకు అందిస్తున్నట్లు దార్లపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణశ్రీ తెలిపారు. దార్లపూడి గ్రామంలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గురువారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. పిల్లలున్న పలు ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. సర్కార్ బడుల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. కార్పొరేట్ స్కూళ్లను మించిన వసతులు ఇప్పుడు ప్రభుత్వ స్కూళ్లలో ఉన్నట్లు తెలిపారు. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే నాణ్యమైన విద్య ప్రభుత్వ స్కూళ్లలోనే ఉంటుందన్నారు. ప్రయివేటు పాఠశాలలకు వెళుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన తెలుసుకుని చేర్పించాలన్నారు. ఆర్థిక సమస్యల కారణంగా ఏ తల్లిదండ్రులు పిల్లలను చదువుకు దూరం చేయవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణి ముత్యాలమ్మ పండగ


బ్రాహ్మణి ముత్యాలమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి బండారు, నాయకులు


అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ అప్పలనాయుడు

పరవాడ: బ్రాహ్మణి ముత్యాలమ్మ అమ్మవారి పండగను భక్తులు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పండగ నేపథ్యంలో ఆలయాన్ని పూలతో అలంకరించి విద్యుత్ తోరణాలతో ముస్తాబు చేశారు. వేకువ జాము నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు ప్రారంభించారు. రాత్రికి తప్పెటగుళ్ళు, డప్పు వాయిద్యాలు, చిడతలు, నేల డ్యాన్సులతో అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. భారీ బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పైల సన్యాసిరావు (మాస్టారు), ఉత్సవ కమిటీ ప్రతినిధి పైల రామచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, గ్రామ ఉపసర్పంచ్ బండారు రామారావు, పైల అప్పలనాయుడు, పెద్ద చెరువు రైతు సంఘం నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, చీపురుపల్లి సన్యాసిరావు, రాజాన సత్యం, పైల చినఅక్కునాయుడు, గండి ఈశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి సాయం

మునగపాక: ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందిన ఆడారి తాతినాయుడు కుటుంబాన్ని ఆదుకునేందుకు మునగపాకలో సంతబయిల ప్రాంతానికి చెందిన పలువురు ముందుకొచ్చారు. దీనిలో భాగంగా గురువారం తాతినాయుడు కుటుంబానికి కర్రి సాయికృష్ణ, పెంటకోట ఆదిశివ, శివగణేష్‌తో పాటు పలువురు స్థానికులు ఆర్థిక సాయం అందించారు. రూ.35,700 నగదును బాధిత కుటుంబానికి అందించి మానవత్వం చాటుకున్నారు.

వైభవంగా మొగలిపురం బంగారమ్మ పండగ


బంగారమ్మ తల్లిని దర్శించుకుంటున్న రవికుమార్ తదితరులు


భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న అతిథులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో కొలువైన శ్రీబంగారమ్మ తల్లి పండగను భక్తులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు బారులుతీరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు అమ్మవారికి సమర్పించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడి బాబు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సిరపరపువారి కల్లాల యూత్ పులిహోర, మజ్జిగ, ఐస్‌క్రీమ్ ముఖ్య అతిథుల చేతుల మీదుగా భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిరపరపు కుమార్, నవీన్, రామదాసు, వసంత్ కుమార్, ప్రశాంత్ నాయుడు, సురేష్, గండి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారుల ప్రతిభ


పేపర్ క్రాఫ్ట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో చిన్నారులు చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. కథలు చదవడం, రాయడం, ధ్యానం చేయటం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పేపర్ క్రాఫ్ట్ ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను నిర్వాహకులు వెలికి తీశారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు


రావాడ ఆర్‌బీకేలో సిద్ధంగా ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

పరవాడ: మండలంలో రైతాంగానికి అవసరమైన పచ్చి రొట్ట విత్తనాలు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో 30 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైన రైతులు సంబంధిత ఆర్‌బీకేల్లో పొందవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి చెప్పారు. జనుము 10 క్వింటాళ్లు, జీలుగ 17 క్వింటాళ్లు, పిల్లి పెసర 2.72 క్వింటాళ్లు చొప్పున మండలానికి ప్రభుత్వం కేటాయించిందన్నారు. రైతులు ఎకరానికి జనుం 16 కిలోలు, జీలుగ 12 కిలోలు, పిల్లిపెసర 8 కిలోలు జల్లుకోవాలని సూచించారు. నాటిన 45 రోజుల్లో భూమిలో కలియదున్నడం ద్వారా తగినంత సేంద్రియ పదర్థాన్ని నేలకు అందిస్తుందన్నారు. తద్వారా రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చన్నారు. విత్తనాలు కావలసిన రైతులు తమ పేర్లను ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలన్నారు. జనుము 10 కిలోల విత్తనాలు రాయితీ పోను రూ.440, జీలుగ 10 కిలోలు రాయితీ పోను రూ.440, పిల్లిపెసర 8 కిలోలు రాయితీ పోను రూ.536కు పొందవచ్చని చెప్పారు.